# పిడికిట్లో జీవితం

నీరజ ఆఫీసుకి వెళ్ళడానికి తయారవుతున్నది. ఇంకా తొమ్మిది గంటలే అయింది. శ్వేతను దారిలో క్రచ్‌లో దింపాలి. ఆ తరువాత మరో సిటీబస్‌లో ఆఫీసుకి వెళ్ళాలి. ఎంత తొందరగా బయలుదేరా లనుకున్నా ఆలస్యమౌతుంది. ఆలస్యం అయినా సూపరింటెండెంట్ ఏమీ అనడు. కాని సహోద్యోగులు రకరకాలుగా అంటూ ఉంటారు.

"సూపరింటెండెంట్‌కు ఆమె అంటే చెడ్డప్రేమ. ఆలస్యమైతేనేం, ఆమెనెందుకంటాడు?"

"నిజంబ్రదర్! ఒక్కరోజేంకర్మ. రోజూ ఆలస్యంగా వచ్చినా సరే అతడికి కావలసింది మనమివ్వలేంగా?"

"ఆ మాటవాస్తవం. నిన్న కర్మకాలి నేను అరగంట లేట్‌అయ్యాను. దారిలో సైకిల్ పంచరైంది. ఎంత చెప్పినా నమ్మలేదు. ఒకపూట సెలవు కోసేసాడు." ఉక్రోషంగా మరొకడు అంటాడు.

నీరజ వాళ్ళమాటలు వింటుంది. విని భరిస్తుంది. రోజూ అనుకుంటుంది. ఈరోజైనా తొందరగా వెళ్ళాలని. కాని అది సాధ్యంకావటం లేదు. బాత్‌రూం ఖాళీ ఉండదు. ఇంటావిడతో రోజూ మొరపెట్టుకుంది. 'దొడ్డమ్మగారు! ముందు నేను స్నానం చేసివస్తాను. ఆఫీసుకి వెళ్ళవలసినదాన్ని'. ఉహు, ఆవిడెందుకు వింటుంది? ఆ ఇల్లు ఆవిడ స్వంతం. ఆ బాత్‌రూమ్ ఆవిడ స్వంతం. ఆమె పని పూర్తి అయ్యేవరకు ఆగాలి. మంచినీళ్ళు పట్టుకోవడానికీ రోజూ యాతనే.

"అయ్యో! నీకంత కష్టంగా ఉంటే మరో ఇల్లు చూసుకో అమ్మా! నువ్విచ్చే రెండువందలకు నీకు రాజభోగాలు కావాలంటే అది ఇక్కడ కుదరదు." నిష్ఠూరంగా అంటుంది. స్త్రీ అయి వుండికూడా అమెతన బాధను అర్థం చేసుకోదు. ఇంటాయన మంచివాడే. కాని అతను తన పెళ్ళానికి జడుస్తాడు.

సూపరింటెండెంట్‌కు తన సాధకబాధకాలు చెప్పుకుంది. అతను మంచివాడు. గ్రహిస్తాడు. "లేట్ ఔతున్నానని బాధపడకు. వచ్చిన దగ్గర నుంచి తలెత్తకుండా పనిచేస్తావు. ఇద్దరి పనిని నీఒక్కరైవు చేస్తావు." అంటూ తనకు పెర్మిషన్ ఇచ్చాడు. అందుకు తోటివారు అసూయపడుతున్నారు. సూపరింటెండెంట్‌తో ఈ విషయంలో వాదులాటకు దిగుతారు. తమ

మధ్య ఏదో అక్రమసంబంధం ఉందని ప్రచారం చేస్తారు. అతనిది తన తండ్రి వయసు. ఇలా ఆడిపోసుకోవడానికి వారికి నోరెలావస్తుంది? వారికి అక్కాచెల్లెళ్ళులేరా? వారి మీద ఈగ వాలినా బాధపడతారే!

ఒంటరిగా జీవించడం ఎంత కష్టమైనది.

ఆరోజు సంఘటన గుర్తుకొచ్చింది.

శ్వేతను తీసుకొని తను గుమ్మం దిగింది.

"హల్లో నీరజగారూ! ఆఫీసుకా?" నీరజ పక్కకు తిరిగి చూసింది. తన ఆఫీసులో పనిచేస్తున్న భాస్కరరావు నవ్వుతున్నాడు.

"ఆలస్యం అయిపోయింది, వస్తాను." అంది నీరజ.

"నేను ఆఫీసుకే వెళ్తున్నాను. వదండి నేను తీసుకువెళ్తాను. బస్సులు సమయానికి వచ్చిచావవు.'

"లేదులెండి. శ్వేతను క్రచ్‌లో దింపిరావాలి?"

"భలేవారే! నాకాసంగతి తెలియదా? ముందు స్కూటర్ ఎక్కండి."

నీరజ సంకోచించింది. పరాయి మగవాడితో స్కూటరుమీద వెళ్తే లోకం ఏమంటుంది? అప్రతిష్ఠపాలుకావడానికి ఎంత సమయం పడుతుంది?

అయితే భాస్కర్ బలవంతం చేసాడు.

"థ్యాంక్స్! నేను బస్సులోనే వెళ్తాను. ఇంకా చాలా టైం వుంది?"

"మీరు సంకోచిస్తున్నారు. నాతో స్కూటరు మీదవస్తే మీరు మైలపడిపోరు"

తనకలాంటి అభిప్రాయం లేదు. కలసిమెలసి పనిచేస్తున్న వాళ్ళతో మాట్లాడాలన్నా, వారితో కలసి కాఫీ త్రాగాలన్నా బిడియంలేదు. అది తప్పుకాదని తాను భావిస్తుంది. అయినా ఇప్పటి పరిస్థితులలో ఎందుకో జంకుగా ఉంది. నీరజకు అంగీకరించక తప్పలేదు. యాదృచ్ఛికంగా అతడు ఇటు వచ్చాడు. స్నేహధర్మంగా లిఫ్టు ఇస్తానన్నాడు.

బాల భారతీ శిశు పాలనా సంస్థ ముందు స్కూటర్ ఆగింది "పాపను దింపిరండి" అన్నాడు భాస్కర్.

"భలేవారే! మీరు శ్వేతను ఇక్కడే దినమంతా ఉంచుతున్నట్లు నాకెలా తెలుసా అని ఆశ్చర్య పోతున్నారా? మీగురించి నాకేమీ తెలియదనుకుంటున్నారా?"

నీరజకు భయం వేసింది. అతనికి ఇంకా ఏఏ విషయాలు తెలిసి ఉంటాయి? వేటినైతే తాను మరిచిపోవాలనుకుంటున్నదో ఆ విషయాలు ఇతరులకు కూడా తెలుసా?

స్కూటర్ వేగం పుంజుకుంది.

"భాస్కర్‌రావుగారు! ఇటు ఎటు తీసుకువెళ్తున్నారు?"

"గాబరా పడకు నీరజా! నేను మిమ్మల్ని ఆఫీసుకి తీసుకువెళ్తాను. ముందుగా బృందావన్‌లో కాఫీ త్రాగుదాం."

"కాఫీయా? నాకు త్రాగాలనిలేదు. స్కూటరు వెనక్కు తిప్పండి" కోపంగా అరిచింది నీరజ.

"కోపగించుకోవడం దేనికి? మీతో కలసి కాఫీ త్రాగాలని మనసైంది. నాతో ఒక కప్పు కాఫీ త్రాగినందున మీరు నష్టపోయేది ఏమీలేదు. ఆ ముసలాడితో రోజూ లంచ్ టైమ్‌లో మీరు టీ త్రాగటం లేదా? నేను అతనికంటె తీసిపోయానా?"

బృందావన్ ముందు స్కూటర్ ఆగింది. ఆ ప్రశ్నకు నీరజ జవాబు చెప్పగలదు. భాస్కర్ ప్రవర్తన ఆమెకు అసహనంగావుంది. అయితే అతనితో గట్టిగా మాట్లాడితే అది నలుగురి కళ్ళాబడుతోంది. అరటాకూ ముల్లూ సామెతలా భాస్కర్‌కు ఏనష్టమూ ఉండదు. నలుగురూ ఫ్రీగా ఈ సీను చూసి ఆనందిస్తారు. తననే అందరూ హేళన చేస్తారు. తానతని స్కూటరెక్కడం పొరపాటు. ఆమె అతడ్ని అనుసరించింది.

"నీరజగారూ! మీరు మీ భర్తకు విడాకులిచ్చారు. మీకు అభ్యంతర లేకపోతే నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను."

"నేను విడాకులిచ్చానా? ఆమాట మీకెవరు చెప్పారు? కొంచెం ఒళ్ళుదగ్గర పెట్టుకుని మాట్లాడండి."

"క్షమించండి. నాది పొరపాటే కావచ్చు. కాని మీరు అశోక్‌ని విడిచి వచ్చి స్వతంత్రంగా బ్రతుకుతున్నారు. అది నిజంకాదా? అలాంటి శాస్తి అశోక్‌కి జరగవలసిందే. అశోక్ బాగా చదువుకున్నవాడే కావచ్చు. డబ్బు ఉన్నవాడే కావచ్చు. కాని అతనిలో మానవత్వం లేదు. మీవంటి లావణ్యవతిని, రూపవతిని, అందులోనూ యవ్వనంలో ఉన్న మిమ్మల్ని ఎందుకు దూరం చేసుకున్నాడు? అతడొట్టి మూర్ఖుడు. పరిస్థితుల కనుకూలంగా నడచుకోవటం చేతకానివాడు. ఆడవాళ్ళను గౌరవించాలని అతనికి తెలియదు. మీరేమైనా పాలరాతి బొమ్మా నాలుగుగోడలమధ్య బంధించి ఉంచడానికి? నాది అశోక్ లాంటి సంకుచిత స్వభావం కాదు."

"శ్రుతి మించి రాగాన పడుతున్నట్లుంది మీధోరణి. మీరు హద్దుదాటుతున్నారు. మీనుంచి నేనెలాంటి సానుభూతిని కోరటంలేదు."

"పొరపడుతున్నారు. నేను మీ బాగు కాంక్షించేవాడిని. ఈ ప్రపంచం గురించి మీకు

అవగాహన లేదు. మీ చుట్టూ దుండగులు, దుష్టులు ఉన్నారు. పురుషుడి సంరక్షణ లేకుండా స్త్రీ బ్రతకలేదు."

"నేను బ్రతుకుతానో చస్తానో అది నా స్వవిషయం."

"మీ వయసనగా ఎంత? తొందరగా పెళ్ళి అయింది కాబట్టి ఒక బిడ్డ తల్లి అయ్యారు. మీ ఈడువాళ్ళు ఇంకా పెళ్ళికూతుళ్ళుగానే ఉంటున్నారు. ఆడపిల్లకు పెళ్ళి జరగడం ఎంత కష్టమో మీకు తెలుసా? పైగా మీరు పరిత్యక్త, ఒక బిడ్డ తల్లి. ఆ పిల్లపోషణకైనా మీకు మగతోడు కావాలి."

.......... ..........

"మీ నిర్ణయం ఇప్పుడే చెప్పవలసిన అవసరం లేదు. బాగా ఆలోచించుకోండి."

"ఇందులో బాగా ఆలోచించుకోవటానికి ఏమీ లేదు. నేను నా పెళ్ళిని రద్దు చేసుకోవాలని అనుకోవడం లేదు. భాస్కర్‌గారు, మీరు నా స్వంతవిషయాల్లో జోక్యం చేసుకోవడం మంచిదికాదు. మనసులో ఇలాంటి దురుద్దేశం ఉంచుకుని ఆఫీసులో డ్రాప్ చేస్తాననే నెపంతో నన్ను బలవంతంగా మీ బండి ఎక్కిస్తారా? ఇక ముందు ఇలాంటి తప్పుడు పనులు చేయకండి. జాగ్రత్త." హెచ్చరించింది నీరజ.

ఆ తరువాత ఆమె బయటకొచ్చి సిటీ బస్‌లో ఆఫీసుకి వెళ్ళింది.

ఆనాటినుండి నీరజను వేధించడం ప్రారంభించాడు. ఆమె గురించి హీనంగా నలుగురితో చెప్పేవాడు.

నీరజ జీవితం దుర్భరప్రాయమైంది. అన్ని పక్కల నుంచీ కష్టాలే – కష్టాలు. తను ఆశించింది ఏమిటి? జరుగుతున్నది ఏమిటి? దేశంలో మంచి మనుషులకు అకాలం వచ్చిందా? స్త్రీ ఒంటరిగా ఈ సమాజంలో బ్రతకలేదా? తను ఒకరి దయాధర్మాలకోసం దేబిరించడంలేదు. తన స్వార్జితంతో జీవించాలనుకుంటున్నది. అయినప్పటికి ఈ విషవలయం తన చుట్టూ ఎందుకు? తను ఏటికి ఎదురీదాలని అనుకుంటున్నదా?

ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి ఎటైనా వెళ్ళిపోవాలనుకుంది నీరజ.

" పిచ్చిదానా! ఎక్కడకు వెళ్ళిపోతావు? అక్కడ భిన్నమైన పరిస్థితులు ఉంటాయా? ఒంటరి ఆడవాళ్ళను తల్లితో సమానంగా చూసే మనుషులు అక్కడ మాత్రం ఉంటారా? నిర్భీతిగా నీవు ఎక్కడ మాత్రం ఉండగలవు? అంతగానీకు వెళ్ళిపోవాలని ఉంటే భర్త చెంతకే వెళ్ళవచ్చునే. ఆలోచించు." అంది అంతరాత్మ.

ఆ ఇంటికి తిరిగి వెళ్ళాలా? అక్కడ తనను గౌరవించేవారు ఎవరు? నీవే శరణం అంటూ అక్కడకు వెళ్తే అశోక్ ఆదరిస్తాడా? అతని కారణంగానే కదూ తాను ఆ ఇల్లు వదిలింది?

ఆ గుమ్మంలో ఎలా కాలుపెడుతుంది. అసంభవం. అలాంటి తలపు వస్తేనే శరీరంమీద పురుగులు ప్రాకినట్లు ఉంటుంది.

తాను ఆ ఇల్లు వదిలి వేయడం తప్పిదమా? స్త్రీజీవితం పిడికిట్లో జీవితమా?

ఎవరి ఆసరాలేకుండా స్త్రీ బ్రతకలేదా?

స్త్రీ అబలకాదు - సబల.

ఆమె సర్వ స్వతంత్రురాలు. పురుషులెంత స్వతంత్రులో స్త్రీలూ అంతే స్వతంత్రులు. సుఖాలు కావాలనుకుంటే కష్టాలకు భీతి చెందరాదు. తనకోరిక ఏమిటి? స్త్రీలు స్వతంత్రులేనని పురుషులకు చెప్పాలి. పురుషాధిక్య ప్రపంచానికి కాలం చెల్లిపోయిందని ఋజువుచెయ్యాలి. 'న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి.' అన్న మనువు వాక్యానికి అర్థం, 'పురుషాధిక్యతకు స్త్రీ లొంగి ఉండాలి' అనేది కాదు.

తనలాంటి ఆదర్శభావాలు కలవారికి అండగా ఎన్నో స్త్రీల స్వచ్ఛంద సంస్థలున్నాయి. రాజ్యాంగం ఉంది. చట్టాలు ఉన్నాయి.

తనకేం తక్కువైందని? పురుషుని కాలిక్రింద చెప్పులా తాను ఎందుకు పడిఉండాలి? స్త్రీ పురుషులం సమానమైనప్పుడు ఒకరు ఎక్కువా వేరొకరు తక్కువా అనే భేదభావం ఎందుకు?

'నీరజా! అంత గర్వం పనికి రాదు. త్రేతాయుగంలో సీతకూడా రావణుడి బారి నుంచి తప్పించుకోలేకపోయింది. ఇది కలియుగం. సందుగొందుల్లో కూడా రావణులున్నారు. ఎంతకాలం నిన్ను కాపాడుకోగలవు?" అంతరాత్మ ఎదురు ప్రశ్న వేసింది.

ఇందులో నాదోషం ఏముంది? నేను కోరి ఏపాపమూ చేయలేదే? ఒక చేత్తో చప్పట్లు చరచబడతాయా? అతని తప్పేం లేదా? తల్లిదండ్రుల్ని, నా ఇంటిని, నా ప్రపంచాన్ని, నాసర్వస్వాన్ని వదిలి అతనితో కాపురం చేయడానికి వెళ్ళానే, మరి నన్ను మనిషిగా చూడాలన్న జ్ఞానం ఉండొద్దా? అతను చెప్పింది తు.చ. తప్పక ఆచరించడమే నాధర్మమా? ఆడదైనంత మాత్రాన ఆమెకు మనసు ఉండకూడదా, స్వంత ఆలోచనలు అభిప్రాయాలూ ఉండరాదా? మంచి చెడులను వ్యక్తీకరించే అధికారం లేదా? అతను చెప్పిందే వేదమా?

కార్యేషుదాసీ కరణేషు మంత్రీ
రూపేచ లక్ష్మీ క్షమయా ధరిత్రీ
భోజ్యేషు మాతా శయనేషు రంభా
షట్కర్మయుక్తా కులధర్మపత్నీ

అని పురుషులే స్త్రీని నిర్వచించారే. కాని అతడు ఈ సత్యాన్ని కూడా విశ్వసించడే. అతని దృష్టిలో భార్య కేవలం దాసి. ఆమెకు సలహాలిచ్చే అధికారం లేదు.

మాటిమాటికి అవమానించే భర్తతో తానెలా కాపురం చేయగలదు? అప్పటికి తాను ఎంతో ఓర్మితో మెలిగింది. సర్దుకుపోతూ వచ్చింది. కాని దేనికైనా ఒక హద్దు ఉంటుంది.

ఆ ఇంటిని, భర్తను విడిచి వచ్చింది. చదువుంది. కనిపెంచిన తల్లిదండ్రులున్నారు. భర్త చేత తిరస్కరించబడుతూ ఆ ఇంటిలో వెట్టిచాకిరి చేయవలసిన అగత్యం తనకెందుకు?

"నీరజా నీవు తప్పుచేశావు. ప్రకృతికి కొన్ని సిద్ధాంతాలున్నాయి. స్త్రీ లతలాంటిది. లత చెట్టు ఆసరాలేకుండా ఎగబ్రాకగలదా? వివాహనికి ముందు సంగతి వేరు. ఇప్పుడు నీ ఇల్లు ఉంది, నీభర్త ఉన్నాడు. కాని వాటిని త్యజించి ఇప్పుడు మా ఇంటిలో ఉండాలనుకుంటున్నావు. నేను నీకు మా ఇంటిలో ఆశ్రయం ఇవ్వలేను."

ధర్మశాస్త్రాలు ఏమని ప్రబోధిస్తున్నాయో నీవు వినలేదా? యవ్వనంలో స్త్రీ భర్త సంరక్షణలో నుండాలి. నీ సుఖదుఃఖాలూ నీ సౌభాగ్య దుర్భాగ్యాలూ ఆ ఇంటితో ముడిపడి ఉన్నాయి. నాకింకా పెళ్ళి కావలసిన ఆడపిల్లలున్నారు. మేము ఈ సమాజంలో బ్రతకవలసినవాళ్ళం. నా మాటవిని నీవు మీ ఇంటికి వెళ్ళు. " తండ్రి అంత నిర్దయగా అన్న మాటలతో నీరజ హతాశురాలు కాలేదు.

ఔను నాన్న మాత్రం పురుషసమాజంలోని వాడు కాదా? కూతురు భర్తను వదిలి వచ్చిందని తెలిసికూడా ఇంత నిర్దయా?

అశోక్ అడుగులకు మడుగులొత్తమని అతనితో తనపెండ్లి జరిపించాడా? తాను ఎలాంటి తప్పు చేయలేదు. మరి శిక్ష ఎందుకు అనుభవించాలి? తను చదువుకున్నది. యుక్తాయుక్తాలు తెలిసినది, ఇంటికి పరాయిపురుషులు వస్తే వారిని కుశల ప్రశ్నలు వేయడం, వారితో చనువుగా మాట్లాడటం నేరమా? పురుషులకొక న్యాయమూ స్త్రీలలోక న్యాయమూనా? అతను యథేచ్ఛగా పరాయి స్త్రీలతో మాట్లాడవచ్చు. కాని ఆడదైన కారణంగా తనకు పరాయివాళ్ళతో మాట్లాడే అధికారం లేదా? ఎంత సంకుచితమైన ఆలోచన!

తండ్రి ఉపదేశం కూడా అలాగే ఉంది. తాను భర్త కాలిచెప్పులా మెలగాలిట.

పతి వదిలి వేస్తే ఆ స్త్రీకి పుట్టింటి తలుపులు కూడా మూసివేయబడతాయా?

ఈ అన్యాయాన్ని తాను సహించదు. ప్రపంచం చిన్నదికాదు తనకు డిగ్రీ చదువుంది. టైప్‌చేయడం వచ్చు. ఇంకా ఎన్నో పనులు చేయగల సామర్థ్యం ఉంది. వీళ్ళు తలుపులు మూసివేసినంతమాత్రాన తన బ్రతుకుతెరువుకు మార్గాలు మూసుకు పోతాయా?

తండ్రి ఇంటిలో ఉండడం కూడా అవమానమే అనుకుంది. ఆ సాయంత్రమే నీరజ చెప్పకుండా బయటకొచ్చింది.

ఇప్పటికి అయిదు నెలలైంది.

నీరజ తల్లి ఆమెను వెతుక్కుంటూ ఓమారు వచ్చింది.

"నీరూ! నువ్వు మీనాన్నగారిని తప్పుగా అనుకోకు, నీవు ఇదే ఊరిలో ఎక్కడో ఉండడం అతనికి ఇష్టంలేదు. నువ్వు నీభర్తతో ఉండాలని అతను కోరుకుంటున్నారు. నీకు అశోక్‌తో కలిసి ఉండటం ఇష్టం లేకపోతే మా ఇంటికి వచ్చేయి. ఇక్కడా అక్కడా ఒంటరిగా ఎందుకు ఉంటావు?"

తల్లి ఏమంటున్నది? వాళ్ళ ఇంటికి వచ్చేయమనా? పెళ్ళి అయినంత మాత్రాన ఆ ఇంటితో తనకు తెగతెంపులయిపోయాయా? తను పుట్టింది ఆ ఇంటిలో, పెరిగింది ఆ ఇంటిలో, కన్నవారి ఇల్లే పరాయిదైనప్పుడు ఎక్కడుంటేనేం? ఈ అద్దె ఇంటిలో ఏ కొఱత ఉంది? అన్ని సదుపాయాలూ లేకపోవచ్చు. కాని ఉన్నవాటితో అడ్జెస్టు అవగలదు.

'అమ్మా! ఇక్కడ ఉండవలసిన ఖర్మ నీకేం? మేం ఉన్నాం, మన ఇల్లుఉన్నది.' అని ఆమె అనిఉంటే?

"నీరజగారూ! మీకు ఫోను" ప్యూన్ వచ్చి చెప్పాడు.

ఎక్కడనుంచి - ఎవరు చేసి ఉంటారు.?

ఎవరో పోకిరివాడై ఉంటాడు.

ఫోనులో మాట్లాడాలంటేనే భయంగా ఉంది.

ఆఫీసరు గదిలోనికి భయపడుతూనే వచ్చింది.

"సార్! నాకేదో ఫోను వచ్చిందని రంగన్న చెప్పాడు."

"కూర్చో! నీరజా! నీకు ఫోను వచ్చిన మాట నిజమే. అశోక్ ఒంట్లో బాగాలేదట. అశోక్ స్నేహితుడు ఫోన్‌చేసి నిన్నొకమారు అతని ఇంటికి పంపించమన్నాడు."

"అలాగా!"

"నువ్వు వెళ్ళే ముందే ఆఫైల్ సూపరింటెండెంట్ గారికియ్యి. ఆపని ఈ రోజే పూర్తి కావాలి"

"సార్! నేను వెళ్ళటం లేదు. ఆపని నేనే పూర్తిచేస్తాను."

"నీరజా! నీ స్వవిషయాల్లో కలుగజేసుకోవడం భావ్యం కాదు. భార్యభర్తల మధ్య గొడవలుండటం అతిసహజం. ఆ కారణంగా ఎవరైనా తన ఇంటిని వదిలేస్తారా? మరోమారు ఆలోచించు. అశోక్ చావుబ్రతుకులమధ్య ఉన్నాడట. ఒకమారు చూసి వచ్చినందున నీవు నష్టపోయేది ఏమి లేదు"

"సార్! మీకు తెలియదు. అశోక్‌కు నేనంటే ఇష్టంలేదు."

నీరజ తన సీటుకి వచ్చి కూర్చుంది. ఆమె ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి

రెండు మూడు నెలల క్రితం అశోక్ ఆమెకొక ఉత్తరం రాసాడు.

నీరూ!

నేను నీపట్ల కౄరంగా ప్రవర్తించాను. అందుకు చాలా బాధపడుతున్నాను. జరిగింది ఒక పీడకల అనుకో. నీవు లేని ఈ ఇల్లు నాకు శూన్యంలా ఉంది. నీవు మన ఇంటికి వచ్చేయి.

నీ

అశోక్

నీరజ ఆ ఉత్తరాన్ని అప్పుడే చింపి ముక్కలు చేసింది.

స్త్రీలు ఒంటరిగా ఉండలేరు అంటాడు అశోక్. ఆర్థికంగా బలహీనులు కావడం వలననే పురుషులకు స్త్రీలు అణిగిమణిగి ఉండవలసి వస్తోంది. లేకుంటే స్త్రీలకేం తక్కువ? చదువుకున్నానని నీకు గర్వం ఎక్కువ. భర్త వదిలేసిన భార్య జీవితం కుక్కలు చింపిన విస్తరి ఔతుంది అంటాడు.

అంటే ఈ పురుషులు పెద్ద హీరోలు! స్త్రీలు చేతకాని చవటలు!!

తన తండ్రి దృక్పథం కూడా అదే. పుట్టినప్పటినుంచి ఆడపిల్లలకు ఇదేశిక్షణ ఇస్తారు. మనం 21వ శతాబ్దంలో ప్రవేశిస్తున్నాం అని వీరెందుకు అనుకోరు?! పురుషులతో సమానంగా జీవించే అధికారం స్త్రీలకుంది. దానిని హరించే అధికారం వీరికెవరు ఇచ్చారు?

పెద్దల మాట చద్దిమూట అంటారు. బహుశా వాళ్ళు అంటున్నది నిజమేనేమో? ఈ అయిదు నెల్లుగా తానెంత నరకాన్ని అనుభవిస్తున్నది! తిండికి బట్టకు లోటులేదు. కాని ప్రాణా లరచేతిలో పెట్టుకుని క్షణక్షణం భయపడుతూ జీవిస్తున్నది.

జీవితాన్ని పిడికిట్లో బిగించి ఉంచడంకూడా సాధ్యంకాదు. ప్రాణం నిలుపుకోవాలంటే ఏదో పనిచేయాలి. అంతటా దుష్టులు - దుష్ట చేష్టలు. తన మానాన్ని రక్షించుకోవడానికి ఎన్ని అవస్థలు!

తండ్రి మాట వినాలా? భర్తను క్షమాపణ వేడుకోవాలా?

మహిళా మండలి వారేమంటారు? స్త్రీలు అబలలు కారు, సబలలే. వారి ఇష్ట ప్రకారం జీవించే హక్కు వారికే ఉంది. భర్తలకు ఊడిగంచేయవలసిన అవసరం వారికి లేదు.

చెప్పడానికి చెయ్యడానికి ఎంత భేదం ఉంది! వీటిని నడిపే మహిళలు గొప్పయింటి పిల్లలు. వాళ్ళు భర్తలతో సుఖంగా కాపురంచేస్తూ స్త్రీలకు సేవచేస్తున్నాం అంటారు. చిన్న చిన్న గొడవలతో విడిపోయిన భార్యా భర్తలు తిరిగి కలుసుకోలేకుండా వారికి హక్కులు అధికారాలు అంటూ ఏవో నూరిపోస్తారు. ఈ హితబోధలు చేసేవారు తమ మొగుళ్ళను వదిలి ఎందుకు రారు?

ఎటూ తోచని స్థితి.

అశోక్ నిజంగా జబ్బు పడ్డాడా? అదెలా సాధ్యం? దృఢంగా ఆరోగ్యంగా వున్న అతనికి ఇంతలో ఏమైంది? తనను పిలిపించుకోవడానికి ఇదొక నాటకమా?

ఏమో! రోగాలు రావటానికి ఎంతటైమ్ పడుతుంది?!

ఏది ఏమైనా, అతన్ని కలిస్తేనే కాని బోధపడదు.

ఆఫీసరుగారు ఏమన్నారు? ఒకమారు కలసి వచ్చినందువలన నష్టమేముంది అని కదా..

నీరజ ఆ ఫైల్ సూపరింటెడెంట్‌కు ఇచ్చింది.

"ఆఫీసు జీపులో వెళ్ళు" అన్నాడతను. శ్వేతను ముందుగా తీసుకుని అశోక్ ఇంటికి వెళ్ళింది నీరజ.

"నీవు తప్పక వస్తావని నాకు నమ్మకం ఉంది. నా ప్రాణాలు నిన్ను చివరిసారిగా చూడడానికే ఇంతకాలం నిలిచి ఉన్నాయి."

నీరజ భర్త మాటలను వినిపించుకోలేదు.

ఏనుగులాంటి మనిషి పీనుగు అవడం అంటే ఇదేనా?

"డాక్టర్ గారు! అశోక్‌కి ఏమైంది?

"ఏమని చెప్పను? టైఫాయిడ్ కావచ్చు. కడుపులో అల్సర్ కావచ్చు. లేదా బ్లడ్ కాన్సర్ కావచ్చు."

"డాక్టర్! ఏమంటున్నారు? డాక్టరై ఉండి, రోగం మీకే అంతుపట్టడం లేదా?"

"ఎలా అంతుపడుతుంది? రోగి సహకరించకపోతే వైద్యవిజ్ఞానం నిష్ప్రయోజనమే. తనకు జీవించాలని లేదంటాడు. అమ్మా! మీకు వీలైతే ఈ మందు త్రాగించండి" డాక్టర్ నీరజతో అని వెళ్ళిపోయాడు.

"అశోక్! విన్నావా డాక్టరుగారు ఏమన్నారో. మందులు తీసుకోకపోతే రోగాలు నయమౌతాయా?"

"నీరూ, నేను నీకు ద్రోహం చేసాను. నీవు నాకు దూరమయ్యావు. దీనికి నా దురహంకారమే కారణం. నేనెవరికోసం బ్రతకాలి?"

"అశోక్, అదేం మాట! తప్పు నీ ఒక్కడిదే కాదు. నేనూ దురహంకారంతోనే ప్రవర్తించాను. నాకిప్పుడు అంతా అర్థమైంది. నీవు బ్రతకాలి... నాకోసం... మన శ్వేతకోసం" అంది నీరజ.

-నడుస్తున్న చరిత్ర - ఆగస్టు 2000